# 13

## ధర్మదేవత గుడ్డికళ్లు

"చస్తినిరో! అయ్యో, అమ్మో! నీ జిమ్మడ, నీకు పోయేకాలం రాను."

లచ్చి జుట్టు పట్టుకుని గభీ గభీమని గుద్దుతున్నాడు సుబ్బన్న సావుకారుపేటలో ఉన్న జయరాంశెట్టి మూడంతస్తుల మేడ ముందున్న పేవ్‌మెంట్ మీద.

త్రోవన పోయే జనం అంతా మూగారు చుట్టూ. పెద్దరికానికి పేరు మోసిన పెద్దమనుష్యులు జనాన్ని తోసుకుంటూ ముందుకు పోయారు. "ఒరేయ్, వదలవేమిరా దాన్ని" గదమాయించాడు, ఓ బుర్రమీసాల పెద్దమనిషి.

ఏదో మించిపోతున్నట్లు "పళ్ళగంప" ఒకర్నొకరు తోసుకుంటూ ముందుకొస్తున్నారు.

పేవ్‌మెంటుమీద సంసారం గడుపుతున్న సుబ్బన్నకు, తఫీమని తలుపులు మూయటానికి ఇల్లున్న మారాజుల్లాగ వీలులేదు గనుక, లచ్చిని వెల్లికిలా పడేట్టు, ఓ తోపుతోసి, చుట్టూ చేరిన గుంపును చూస్తూ, గొణుక్కుంటూ దిమ్మె దగ్గరకు పోయి "టక్ టక్"మని దబ్బనాన్ని సాగగొడుతున్నాడు సుత్తితో.

"ఎందుకురా దాన్ని కొడతావ్?" ఓ ఖద్దరు సిల్కు లాల్చీలోవున్న పెద్దమనిషి అన్యాయపు అంతు తెలుసుకోవాలనే మనస్తత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రశ్నించాడు.

జారిపోయిన పమిట సర్దుకుంటూ, క్రింద పెదవినుండి కారుతున్న రక్తాన్ని తుడుచుకుంటూ, గోడకు ఆనుకూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది లచ్చి.

దబ్బనం మొన సన్నగా సాగకొడుతూ మధ్య మధ్య చురచురా చూస్తున్నాడు సుబ్బడు లచ్చివైపు. ఎండ చిట చిట లాడ్తూంది. నొసటి నుండి ఘర్మజలం కారుతూంది దిమ్మెమీదకు.

గుండ్రని ముఖం, ఎత్తయిన నున్నని బుగ్గలు, చామనచాయ, రక్తంతో ఎర్రబడ్డ పెదాలు కొత్త అందాన్ని ఇస్తున్నవి మంచి వయస్సులో ఉన్న లచ్చికి. అంత అందమైన వయస్సులో ఉన్న ఆడది ఏడుస్తుంటే చాలా మందికి జాలివేసింది. తలోక రకంగా సానుభూతి చూపుతున్నారు

"అసలెందుకే నిన్ను కొట్టింది?" జరీ కండువాను సర్దుకుంటూ అడిగాడు లచ్చిని ఓ జలసారాయుడు జనంలోనుంచి.

"ఏంలేదు దొరా! పొద్దున్నుంచీ ఇట్టా సంపేస్తున్నాడు దొరా!"

"ఒసేయ్? ముయ్యేయ్ నోరు. అబధ్ధం కూసేవంటే, గొంతు పిసికేత్తా" చేతిలోని సుత్తి క్రింద పడేసి లేవబోయాడు సుబ్బడు.

"ఓరేయ్, ఆగరా!" అంటూ గుడ్లురిమేడు ఓ బొర్రమీసాల నాయుడు, సుబ్బడికి దగ్గరగా వచ్చి.

"కాద్దొరా! పొద్దున్నుంచీ సెబుతున్నా దొరా దానికి. నూచులు, దబ్బనా లెత్తుకెల్లి బువ్వడుక్కు రమ్మని! నిన్న పొద్దునంగ కూసంత గంజి తాగినా దొరా! ఆకలేత్తుంది పోయిరావంటే కదల్లేదు, ఆ వజాన కూసుని!"

"ఏమే?" అంటూ నాయుడుగారు లచ్చివైపు చూశాడు. (అందరూ లచ్చివంకే చూస్తున్నారు) మళ్ళీ దిమ్మె దగ్గరకు పోయి కూర్చున్నాడు సుబ్బడు.

"రాత్తిర్నించీ కాళ్లూ, చేతులూ పీక్కుపోతున్నాయి దొరా! తల నొప్పేస్తుంది. యీచచ్చినోడు పొద్దున్నుంచీ నా పాణం తీస్తున్నాడు దొరా" అంటూ లచ్చి బావురుమని యేడవటం ప్రారంభించింది.

దాంతో లచ్చికి సానుభూతి చూపేవాళ్లెక్కువయ్యారు. అప్పుడే వచ్చిన వాళ్ళంతా "అసలు సంగతేంటి?" అని పక్కనున్న వారిని అడుగుతున్నారు; ఏదో తమకు దొరక్కుండా మించిపోయినట్లు.

"ఒరేయ్ పశువా! వంట్లో బాగా లేనిదాన్ని అలా కొడతావట్రా?" ఖాదీ సిల్కు లాల్చీలో నుంచి.

"అదొట్టి దొంగది దొరా! నిన్నొచ్చిన డబ్బులన్నీ రాత్రిరి కరుసు పెట్టింది. ఊళ్లోకి పోయి సూదులమ్ముకురాయేంటే మంకేసింది దొరా! సోంబేరిముండా; అబద్దాలు సెప్తావా?" అంటూ లచ్చివైపు తీక్షణంగా చూశాడు సుబ్బడు.

"నా కియ్యలేదు దొరా! సామితోడు డబ్బులన్నీ దేనికో ఇచ్చేండు. నన్ను సావతంతండు. ఎప్పుడూ ఇట్టానే ఏదిత్తాడు. ఈడి సిరుసు పగల!" మధ్య మనుష్యుల ఆసరా చూసుకుని తిట్లకు లంకించుకుంది లచ్చి.

సుబ్బడికి వళ్ళు మండిపోతూంది. ఇంక ఆగలేకపోయాడు. ఒక్క దూకులో పోయి, తప్పుకు పోబోతున్న లచ్చి జుట్టు లంకించుకుని బాదుతున్నాడు—"తప్పుడు కూతలు కూత్తావా?" అంటూ.

"వొరేయ్! వదులు దాన్ని, ఆగరా" అంటూ ముందు వరసలో ఉన్న వాళ్ళంతా అడ్డం పోయారు సుబ్బడికి. అంతలో ఓ పెద్ద క్రాపు యువకుడు సుబ్బడి రెక్క పట్టుకుని ఒక్కలాగు లాగాడు. ఇంకా యిద్దరి ముగ్గురి సహాయంతో సుబ్బడ్ని వెనక్కు నెట్టుకెళ్ళారు. తన్ను పట్టుకున్న వాళ్ళనుండి విడులించుకుంటున్నాడు సుబ్బడు.

లచ్చి స్వరం అంతిమ స్థాయికి పోయింది. తిట్టటం మానలా.

"తన్నండి వెధవను పొగరెక్కి చస్తున్నాడు" మీసాలనాయుడు రంకె వేశాడు.

"వొరేయ్ పశువా! ఆడదాని వంటిమీద చెయ్యి వేస్తావురా?" అన్నాడు గ్లాసుకో తెల్ల దుస్తుల్లో ఉన్న యువకుడు చేతిలోని "సంస్కారి" పత్రికను సర్దుకుంటూ.

"మీకు తెలవదు దొరా! మీ రెల్లండి, మీరుంటే అది అట్టాగే మంకేశం ఏత్తుంది" అంటూ సుబ్బడు బుసకొడుతున్నాడు. కండ్లు చింతనిప్పు లాగ ఉన్నాయి. కసి కళ్ళగుండా చూస్తుంది. పళ్ళు బిగించి జనాన్ని తప్పుకుని లచ్చివంక చూస్తున్నాడు.

"వొరేయ్ ! యీ తడవ దాని వంటిమీద చెయ్యి పడిందా, నీ వీపు చెడుతుంది జాగ్రత్త" ఖద్దరు సిల్కు లాల్చీలోనుంచి.

"మీకేందశ ! నా పెళ్లాన్ని నే కొట్టుకుంటా, చంపుకుంటా మీ కెందుకూ ? మీ రెల్లిపొండి" మధ్య చేరిన పెద్దమనుష్యుల్ని ఒళ్లు తెలియని కోపంతో నిర్లక్ష్యంగా అన్నాడు.

"వొరేయ్, నీ పెళ్లాన్ని కొడితే ఊరుకుంటామట్రా ?" గ్లాస్కో లాల్చీలోనుంచి.

"ఆఁ ఏం పొగర్రా ?" నాయుడు మీసాలు తిప్పుకుంటూ.

"మనం అంతా పోతే ఇవ్వాళ వీడు దీన్ని బ్రతకనివ్వడు" చీలమండ లంటుకోటానికి ప్రయత్నిస్తున్న ఎం. ఎస్. ర5 చొక్కా ఆంధ్ర విద్యార్థి లాగున్నాడు.

"వీడి తిక్క ఇలా కుదరదులే" ఖద్దరు లాల్చీలో ఉన్న పెద్దమనిషి నాయుడిగారి చెవిలో ఏదో చెబుతున్నాడు. జనం అంతా వాళ్ళిద్దరివైపూ చూస్తున్నారు.

* * * * *

ఇంటిముందు జరుగుతున్న గందరగోళానికి, రూపాయి విలువ తగ్గింపును గురించి పత్రికలో చదివి, బంగారు వస్తువులేమీ అమ్మవద్దని గుమ స్తాతో చెబుతున్న జయరాంశెట్టిగారు కంగారు తిన్నారు. దాంతో మొదటి అంతస్తు వరండాలోకి వచ్చి, క్రింద మూగిన జనాన్ని గాభరాగా చూస్తు న్నాడు. క్రిందకు పోయిన గుమస్తా సంగతంతా తెలుసుకొచ్చి చెప్పింతర్వాత ప్రాణాలు కొంత కుదుటపడి, శెట్టిగారు ఫోన్ దగ్గరకు వెళ్ళి డయల్ చేశాడు. స్టేషనుకు...హల్లో...ఆఁ జయరామ శెట్టిని. ఆఁ యిక్కడ కొట్లాట జరుగుతుందీ...తొందరగా రావాలి. అర్జంటు.

* * * *

"పోనియ్యండీ మనకెందుకూ ? వాళ్ళ గొడవ వాళ్ళు పడతారు" అన్నాడు ఒక ముసలాయన జనంలోనుండి తప్పుకు వెళుతూ.

"మా బాగా చెప్పావయ్యా ? కళ్ళముందింత ఘోరం జరుగుతూంటే చూస్తూ ఊరుకోమంటావా ?" అందుకున్నాడొక పెద్దమనిషి.

"ఘోరమంటే ఘోరం—అందరిళ్ళల్లో జరిగేదంతానో ?" విసురుగా అన్నాడు ముసలాయన.

"ఏంటా ముసలిపీనుగ సణుగుడు ? నోరు మూసుకోవయ్యా" యీ విధంగా తలోక మాటంటూ, పాపం ఆ ముసలాయన్ని మళ్ళీ నోరెత్తనివ్వ లేదు.

"లచ్చి కొంచెం శ్రుతి తగ్గించి, జనంవంక బెదురుగా చూస్తూంది. సుబ్బడు తన సామానులు సర్దుకుంటూ యేమేమో తిడుతున్నాడు. లచ్చికే గాక అడ్డం వచ్చిన వాళ్ళకు కూడా భాగం లేకపోలేదందులో.

ఇంతలో జనాన్ని తోసుకుంటూ నలుగురు కానిస్టేబుల్సు, యినస్పెక్టరు గుంపులోనుంచి ముందుకొచ్చారు.

పోలీసులు లాఠీలతో సర్దుతున్నారు ఎగబడి చూస్తున్న జనాన్ని.

"సమయానికి వచ్చారు" ఖాదీ సిల్కు లాల్చీ యినస్పెక్టరుగార్ని విష్ చేస్తూ అన్నాడు.

"ఏమిటీ! యీ న్యూసెన్సు?" సబ్ యినస్పెక్టర్ హేట్ సర్దుకుంటూ అన్నాడు.

"ఇదుగో వీడే! దొంగవెధవ దాన్ని చంపేస్తున్నాడు." సుబ్బడ్ని, లచ్చినీ చూపిస్తూ నాయుడు మీసాన్ని సర్దుకుంటూ ధీమాగా అన్నాడు.

భయంతో వణికిపోతూ, మోకాళ్లమీద జారబడి "లేద్దొరా, మీ కాళ్ళకు మొక్కుతా" అంటూ నమస్కరిస్తున్న సుబ్బడి గుండెమీద యినస్పెక్టరు బూటుకాలు నాడాలు శబ్దం చేస్తున్నాయి. వెల్లకిలాపడ్డ సుబ్బడ్ని రెండు రెక్కలూ పట్టుకుని గుంజి నుల్చోపెట్టారు యిద్దరు పోలీసులు.

లచ్చి పెద్ద పెట్టున యేడుస్తూ జనాన్ని తోసుకొనివచ్చి అధికారికి వొంగి వొంగి దణ్ణం పెడుతూ.

"ఊరుకోండి దొరా, వాడేమీ సేయలేదు" అంటూ వణుకుతూ అధికారి ముఖంలోకి చూస్తుంది.

ఇన్స్పెక్టరు కాళ్ళమీద పడుతున్న సుబ్బడ్ని పోలీసులు "వేన్" దగ్గరకు లాక్కుపోతున్నారు.

సుబ్బడ్ని అమాంతంగా కావలించుకుని "వదలండి బాబూ, మీ కాళ్ళకు మొక్కుతానంటున్న" లచ్చిని వెనక్కు నెట్టి బలవంతంగా పోలీసులు సుబ్బడ్ని వేన్‌లో యెక్కించారు.

కాళ్ళమీదపడ్డ లచ్చిని విదిలించి, శెట్టిగారి దగ్గర శెలవు తీసుకుని అధికారి వేన్‌లో యెక్కాడు.

లచ్చి తల బాదుకుని యేడుస్తూంటే, బుర్రమీసాలూ, గ్లాస్కో పంచెలు ఎగాదిగా చూస్తున్నాయి గుడ్లు మిటకరించి.

వేన్ సాగిపోతూంటే లచ్చి యేడుస్తూదాని వెంట పరుగెత్తుతూంది. జనం ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"హుఁ అలగా జనం, ఎంతచేస్తేనేం, నీతా జాతా! అది చూడు మరి" ఖాదీ సిల్కు లాల్చీ ఆయన ఆముదం తాగినట్టు ముఖం పెట్టి అంటున్నాడు.

"వోస్ దీని తస్సాగొయ్యా" నాయుడు చిత్తుపోయి మీసం పీక్కుంటూ బయపడుతున్నాడు జనంలోనుంచి.

"హుఁ ఆడది ఇలా ఉన్నంతకాలం మొగవాడంతే. అయినా సంస్కారంలేని జాతి" సంస్కారి పేపరు చంకలో పెట్టుకుంటూ అంటున్నాడు యువకుడు.

"పేదోళ్ల సంసారం పెద్దోళ్ళకు లోకువ పేదోళ్ళకు - మాత్రం ప్రేముండదూ?" అంటూ వేన్ వెంబడి పెరుగెత్తుతున్న లచ్చిని జాలిగా చూస్తూ "రామరాజ్యంలో, జాంబవంత న్యాయం" కాండ్రించి ఊశాడు ముసలాయన.

*     *     *

సుబ్బన్నను 24 గంటలు రిమాండులో ఉంచారు. ఆ రాత్రి సుబ్బన్న ఉన్న జైలులో యింకో ఖైదీని పెట్టారు. తలకు కట్టుకట్టి ఉంది. ముఖం మీద రక్తం గడ్డకట్టిన చారలు ఇంకా ఉన్నాయి. పాలిపోయిన శరీరం. చాలా నీరసంగా కన్పిస్తున్నాడు. కళ్లలో వో ప్రత్యేకత కన్పిస్తూంది. గోడకు జారబడి నీరసంగా కూర్చుని ఉన్నాడు. ఆ వ్యక్తిని చూడగానే శరీరం గగుర్పొడిచింది సుబ్బన్నకు. కొంచెంసేపు దీక్షగాచూసి "వోరు బాబూ మీరు?" అని సుబ్బడు ప్రశ్నించాడు.

సుబ్బడివంక ఒకమాదిరిగాచూసి "యికనుంచీ చచ్చేంతవరకు ఖైదీని" సమాధానం యిచ్చాడు బరువుగ వూపిరితీస్తూ.

"అంటే ఖూనీకేసా దొరా ?"

"హుఁహూఁ కాదు."

"దొంగతనమా బాబూ ?"

"హుఁ కాదు."

"అయితే నేరం ఏంది బాబూ ?"

"మనిషిలాగా బ్రతకాలని, మనిషికీ-జంతువుకు భేదముందని నమ్మేను."

"అదేంది బాబూ ?" అంతా అయోమయంగా వుంది సుబ్బడికి.

"నగ్నంగా—"

"అంటే ?"

"గుడ్డలేకుండా వందలకొలది తోటివాళ్ళతో స్త్రీలముందు నుంచో టాన్ని వ్యతిరేకిస్తూ నాలోని మానవత్వం స్పృహావున్నదాకా తిరుగుబాటు చేసింది! తెలిసిందా ? నేను చేసిన నేరం !" ఉద్రేకంతో అన్నాడు.

"ఎంతన్యాయం బాబు ? ఆళ్ళ కళ్ళుపోతాయ్ బాబూ! సుబ్బడు గొంతు పెకిలించుకొని అన్నాడు.

"ఐతే ! నీవేం చేశావు ?"

"ఏంలే ద్దొరా ? మా ఆడది నేను ఏదో కూత్తె కీసులాడుకుని రెండు తగలనిచ్చానో లేదో దోవనబోయే ఆళ్ళూ-యీళ్ళూ సేరి పెద్దగొడవచేసి పోలీసోళ్ళకు పట్టిచింద్రు దొరా."

"కొట్టాల్సిన అవసర మెందుకొచ్చింది ?"

అది శానాగడ్సది దొరా ! పన్లోకిపొమ్మంటే, వంటో వులుసులేదని మొండికేసింది.

ఐతే ! అంతమాత్రానికే కొట్టుకుంటారా ? నిజంగానే సుస్తీగా వుందేమో ! జబ్బులోవుండి పనిచేయలేని స్థితిలోవున్నా—రెక్కలు ముక్కలయేట్టు పనిచేస్తేగాని పొట్టపూడని స్థితికి కారణం తెలుసుకో ! నీ ఆకలి

మంటలకు నీతో పాటు బాధపడే నీ భార్య ఎర కాకూడదు. నీలాగా కష్టించి పని చేసే నీ ప్రక్కవాడు నీ అసంతృప్తికి గురి కారాదు. పొద్దస్తమానం ఎముకలు పిండి మూలుగు ధారపోసినా– అర్ధాకలితో అలమటించాల్సిన కర్మకు కారణమేంటో ఆలోచించు.

"ఏయ్! జైల్లోకూడా మొదలుపెట్టావ్?" జైలువార్డరు గదిదగ్గరకు వస్తూ అన్నాడు.

"వాళ్ళకూ కూడా నూరిపోస్తున్నావా? నీ పని యిట్లా కాదులే! రా!" వార్డరు ఖైదీని పక్క గదిలోకి తీసుకుపోయాడు.

"ఇదిగో యింక దాన్ని ఎప్పుడూ కొట్టవుగా?" పోతూ అన్నాడు సుబ్బడితో ఖైదీ.

"పెమాణం చేస్తున్నా దొరా! యింక లచ్చిపంటిమీద చెయ్యియెయ్యను. తెలొచ్చింది దొరా దేవుడల్లే సెప్పారు!"

కళ్ళలో కాంతిరేఖల్తో కదిలిపోతున్న ఖైదీని గేటు యినుపచువ్వలోంచి కళ్ళనీళ్ళతో సాగనంపాడు సుబ్బడు.

పోలీసులు తన్ను వేన్‌లో యెక్కిస్తాంటే–గుండెలు తరుక్కుపోయేలా యేడుస్తూ వేన్ వెంట పరుగెత్తుతున్న లచ్చి గుర్తుకొచ్చి జుట్టు పీక్కుంటున్నాడు సుబ్బడు.

తెల్లవారి జైలునుండి విడుదలై. లచ్చి యేమయిందోనని ఆదుర్దాతో పోబోతున్న సుబ్బడ్ని, అందాకా జైలుకెదురుగా వున్న చెట్లక్రింద పడి వున్న లచ్చి అమాంతంగా కావలించుకుని చిన్న పిల్లలాగా బావురుమని యేడ్చింది. సుబ్బన్న లచ్చిని దగ్గరగ తీసుకున్నాడు. లచ్చివళ్ళు జ్వరంతో మండిపోతూవుంది. లచ్చి తలమీద పడుతూన్న సుబ్బడి కన్నీరు ఆవిరైపోతున్నాయి. ధర్మదేవత గుడ్డికళ్ళు చెమ్మగిల్లాయి,